# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

పత్రికా ప్రకటన

మార్చ్ 30, 2012

## ప్రజాస్వామికవాదులకు, దేశభక్త ప్రజలకు మా విజ్ఞప్తి

## మాడ్ ప్రాంతంలో ప్రభుత్వ సాయుధ బలగాలు సాగించిన బీభత్సకర క్యాంపెయిన్‌ను ఖండించండి!

## అత్యంత నిరుపేద దేశవాసులపై సాగిస్తున్న అన్యాయ యుద్ధాన్ని ఆపడానికి ముందుకు రండి!

మార్చ్ మొదటి అర్ధభాగంలో మాడ్ ప్రాంతంలోని 20-25 ఆదివాసీ పల్లెలను ప్రభుత్వ సాయుధ బలగాలు తమ ఇనుప బూట్లతో నలిపేశాయి. దీని ద్వారా నిత్యం ఆదివాసుల 'అభివృద్ధి' గురించి వల్లించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమానుష, ఫాసిస్టు ముఖం మరోసారి బైటపడింది. మాడ్ ప్రాంతంపై జరిగిన ఈ అతి పెద్ద ఆపరేషన్‌లో 3,000 పైగా సాయుధ బలగాల్ని ప్రయోగించారు. దీనికి 'ఆపరేషన్ విజయ్', 'ఆపరేషన్ హాకా' అని పేర్లు పెట్టారు. ఫిబ్రవరి 22న కేంద్ర హోంమంత్రి నాయకత్వంలో జరిగిన నక్సలైటు ప్రభావిత రాష్ట్రాల డిజిపిల, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారమే ఈ భారీ అణచివేత క్యాంపెయిన్‌ను నిర్వహించారు. దాదాపు రెండు వారాల పాటు సాగిన ఈ ఆపరేషన్‌లో ఒక ఆదివాసీని హత్య చేశారు. మరొకరిని ఎత్తుకెళ్లారు. ఇప్పటికీ అతని ఆచూకీ లేదు. దాదాపు రెండు డజన్ల గ్రామాలకు చెందిన అనేక మంది అమాయక ఆదివాసులు హింస, దోపిడీ, విధ్వంసం, చిత్రహింసలకు గురి చేయబడ్డారు.

సీఆర్‌పీఎఫ్ (కోబ్రా), ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్ర పోలీసులు, సీ-60 కమాండోలు, ఎస్‌టీఎఫ్, ఎస్‌పీవోల సంయుక్త బలగాలు అనేక బ్యాచ్‌లుగా విడిపోయి ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్, బీజాపూర్ జిల్లాల నుండి, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా నుండి ఒకేసారి బయలుదేరాయి. సీఆర్‌పీఎఫ్ డిజి విజయ్‌కుమార్, ఛత్తీస్‌గఢ్ డిజిపి అనిల్ నవానీ, మహారాష్ట్ర డిజిపి సుబ్రహ్మణ్యం ఈ మొత్తం ఆపరేషన్‌కు పథక రచన చేయగా ఛత్తీస్‌గఢ్ ఏడిజి (నక్సల్) రామ్‌నివాస్, సీఆర్‌పీఎఫ్ ఐజి (ఛత్తీస్‌గఢ్ ఇంఛార్జ్) పంకజ్ సింగ్, బస్తర్ ఐజి టిజె లాంగ్‌కుమేర్‌లు నారాయణ్‌పూర్‌కు దగ్గరలో వున్న కురుస్‌నార్ బేస్ క్యాంప్‌లో డేరా వేసి ఈ దాడిని పర్యవేక్షించారు. నారాయణ్‌పూర్ ఎస్‌పి మయంక్ శ్రీవాస్తవ్, బీజాపూర్ ఎస్‌పి రాజేంద్ర్ నారాయణ్ దాస్ సహా అనేక మంది ఎస్‌పి స్థాయి అధికారులు ఈ దాడికి ప్రత్యక్ష నాయకత్వం వహించారు. మహారాష్ట్రతో అనుకుని వున్న మాడ్ పశ్చిమ భాగం నుండి బీజాపూర్ జిల్లాను ఆనుకొని వున్న దక్షిణ దిశ నుండి, అంటే ఇంద్రావతి నది ఆవలి నుండి, మాడ్‌కు ఈశాన్యంలో వున్న నారాయణ్‌పూర్ జిల్లా కేంద్రం నుండి పథకం ప్రకారం ఈ సంయుక్త ఆపరేషన్‌ను నడిపించారు.

ఎస్‌పీవోలను, ఇతర ఇన్‌ఫార్మర్లను తీసుకొని జి.పి.ఎస్., యు.ఎ.వి. (మానవరహిత విమానాలు) మొదలైన అత్యాధునిక ఉపకరణాల సహాయంతో అడవి దారుల గుండా 40-50 కిలోమీటర్ల దూరం నడిచి ఒకేసారి అనేక గ్రామాల్లో దాడి చేశారు. మహారాష్ట్ర వైపు నుండి బయలుదేరిన సాయుధ బలగాలు మార్చ్ 14న గొడ్డెల్‌మర్క గ్రామంపై, 15న ఈకోనార్ గ్రామంపై దాడి చేశాయి. బీజాపూర్ నుండి బయల్దేరిన బలగాలు మార్చ్ 11-15 తేదీల మధ్య తాకిలోడ్, రేకవాయ, వెడమ, డుంగ, కుమ్‌నార్, తాడిబల్ల, కుమ్మం సహా దాదాపు 10-12 గ్రామాలపై దాడులు చేశాయి. నారాయణ్‌పూర్ నుండి బయల్దేరిన బలగాలు మార్చ్ 15-16 మధ్య కచ్చాపాల్, తోకె, కోడెనార్, జట్‌వార్ మొదలైన గ్రామాలపై దాడులు చేశాయి. తోకె గ్రామంలో ప్రభుత్వ బలగాలు డుంగ ధుర్వ అనే ఆదివాసీని హత్య చేశాయి. గొడ్డెల్‌మర్క గ్రామానికి చెందిన లాల్సు అనే యువకుణ్ని హత్య చేసినట్టు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కచ్చాపాల్ గ్రామానికి చెందిన సోనుపై, గొడ్డెల్‌మర్క గ్రామస్తురాలైన జైనిపై కాల్పులు జరపగా వాళ్లిద్దరూ గాయపడ్డారు. ఇంతే కాకుండా, ప్రభుత్వ సాయుధ బలగాలు దాడి చేసిన ప్రతి గ్రామంలోనూ దోచుకోవడం, కొట్టడం, ఇండ్లు కాలబెట్టడం, విధ్వంసం మొదలైన అకృత్యాలకు పాల్పడ్డాయి.

ఇంద్రావతి నదికి దక్షిణ భాగంలో వున్న పడ్కో గ్రామంలో ప్రభుత్వ బలగాలు ఒక వ్యవసాయ క్షేత్రాన్ని ధ్వంసం చేశాయి. ఇందులో

గ్రామస్తులు సమిష్టిగా పని చేసి కూరగాయలు, మొక్కజొన్నలు పండించారు. ఇదే గ్రామ సమీపంలో విప్లవ జనతన సర్కార్ నడిపే స్కూలుపై కూడా వందలాది సాయుధ బలగాలు దాడికి పాల్పడ్డాయి. దాడిని ముందే పసిగట్టిన విద్యార్థులు, టీచర్లు అక్కడి నుండి తప్పుకున్నారు. బలగాలు రెండు రోజుల పాటు అక్కడే డేరా వేసి బీభత్సాన్ని సృష్టించాయి. జట్‌వార్, ఈకోనార్, తోకె గ్రామాల్లో కూడా ఇలాగే దాడులు చేశారు. ఈ మొత్తం ఆపరేషన్‌తో మాడ్ ప్రాంతమంతటా భయోత్పాత వాతావరణ నెలకొంది. ఈ ఆపరేషన్ సాధించిన 'విజయం'గా చెబుతూ 13 మంది 'మావోయిస్టుల'ను అరెస్టు చేసినట్టు ప్రకటించారు. నిజానికి వాళ్లంతా సాధారణ ప్రజలే. గ్రామాల్లో కనబడిన ప్రతి ఒక్కరినీ పట్టుకున్నారు. (ఈ అప్పీల్‌తో పాటు జతపరుస్తున్న రిపోర్టులో దాడికి సంబంధించిన పూర్తి వివరాలున్నాయి.)

ఇది గత రెండున్నర ఏళ్లుగా సాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ లేదా 'ప్రజలపై యుద్ధం'లో భాగమనేది స్పష్టం. మాడ్ ప్రాంతంపై ఇటువంటి దాడి చేయడం వెనుక వాళ్ల లక్ష్యం ప్రజల్ని భయోత్పాతానికి గురి చేసి గ్రామాల్లోంచి వెళ్లగొట్టడమే. వాస్తవానికి ఈ మొత్తం ప్రాంతాన్ని సైన్యానికి అప్పగించే సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక్కడ నివసిస్తున్న ప్రాచీన మానవ సముదాయాల్లో ఒకటైన మాడియా తెగ ప్రజల అస్తిత్వానికి పెద్ద ముప్పు పొంచి వుంది. ప్రభుత్వాలు తమ లక్ష్యం 'అబూజ్‌మాడ్‌ను మావోయిస్టుల నుండి విముక్తి చేయడం'గా చెప్పుకుంటున్నప్పటికీ ఈ దాడి జరిగింది గ్రామాల పైననే అనేది వాస్తవం. ప్రజల వ్యవసాయ క్షేత్రాలపై, స్కూళ్లపై, ఇండ్లపై జరిగిన దాడి ఇది. మావోయిస్టు వుద్యమ క్రమంలో ప్రజలు నిర్మించుకుంటున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాపై జరిగిన దాడి ఇది.

మాడ్ ప్రాంతంపై దాడి చేసి దీనిపై అదుపు సాధించడం కోసం దోపిడీ ప్రభుత్వాలు ఎందుకింత త్వరపడుతున్నాయి? ఎందుకంటే ఈ ప్రాంతం అత్యంత విలువైన ఖనిజ సంపదల ఖజానా కూడా అనేది తెలిసిందే. దీని పక్కనే వున్న రావ్‌ఘాట్ పర్వత సానువుల నుండి ఇనుప ఖనిజాన్ని వెలికి తీయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాంతంపై ప్రత్యేకించి టాటా, ఎస్సార్ మొదలైన కార్పొరేట్ కంపెనీల కన్నుంది. ఇదే ప్రాంతంలో వున్న ఆమ్‌దాయ్‌మెట్ట ప్రాంతంలో గనుల్ని ప్రారంభించడానికి నెకో జయస్వాల్స్ అనే కంపెనీ నానా తంటాలు పడుతున్నది. ఈ ప్రాంతం నుండి ఆదివాసుల్ని పారదోలే రోజు కోసం అనేక కంపెనీలు ఆత్రుతగా వేచి వున్నాయి. మావోయిస్టు వుద్యమం వుండగా ఈ పని సులువేమీ కాదనే విషయం వాళ్లకు స్పష్టంగానే తెలుసు. అందుకే వాళ్లు మావోయిస్టు వుద్యమాన్ని అణచివెయ్యాలని మాట్లాడుతున్నారు. అలా ఈ ఆపరేషన్ వెనుక ఇక్కడి అడవుల్లో, పర్వతాల్లో నిక్షిప్తమై వున్న సహజ సంపదల్ని కొల్లగొట్టాలనే కుట్రలు దాగి వున్నాయి. అవి దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల, సామ్రాజ్యవాదుల దోపిడీ విధానాలతో ముడివడి వున్నాయి. ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదం మన దేశ అంతర్గత వ్యవహారాల్లో ప్రమాదకర స్థాయిలో జోక్యం చేసుకుంటున్నది. భారతదేశంలో సాగుతున్న కౌంటర్ ఇన్‌సర్జెన్సీ కార్యకలాపాల్లో తమ ప్రత్యేక బలగాలు (స్పెషల్ ఫోర్సెస్) ప్రత్యక్షంగా పాల్గొంటున్నాయని ఇటీవలే పెంటగాన్ వెల్లడి చేసింది. అంటే దేశ దళారీ పాలకులు దేశ ప్రకృతి సంపదల్ని కార్పొరేట్ దోపిడీ దొంగలకు కట్టబెట్టే దారిని సుగమం చెయ్యడం కోసం మన దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టడానికి కూడా వెనుకాడరన్నమాట!

ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం మాడ్ ప్రాంతంలో 'ఆపరేషన్ విజయ్', 'ఆపరేషన్ హాకా' పేరుతో సాగించిన బీభత్సకాండను, హింసను తీవ్రంగా ఖండించాలని దేశంలోని ప్రగతిశీల, ప్రజాస్వామిక, విప్లవ సంస్థలకు, మానవహక్కుల సంఘాలకు, మేధావులకు, రచయితలకు, విలేకరులకు, మీడియామిత్రులకు, కళాకారులకు, సినీరంగ మిత్రులకు, రైతుకూలీలకు, కార్మికులకు, విద్యార్థులకు, అధ్యాపకులకు – అందరికీ మేం సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ మొత్తం ఆపరేషన్‌పై మా స్పెషల్ జోనల్ కమిటీ తయారు చేసిన రిపోర్టును ప్రతి ఒక్కరూ చదవాలని, ప్రచురించాలని, ఇందులో ఇచ్చిన వివరాలను ప్రచారం చెయ్యాలని మేం కోరుతున్నాం. సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసన ప్రదర్శనలు, ప్రెస్ మీట్, సంతకాల సేకరణ వంటి వివిధ రూపాల్లో ఈ దాడి పట్ల నిరసన వ్యక్తం చేయాలని కోరుతున్నాం. ఈ దాడికి గురైన గ్రామాల్ని పర్యటించి వాస్తవాల్ని స్వయంగా తెలుసుకోవాలని మేం విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ ఆపరేషన్ సందర్భంగా పట్టుకున్న 13 మంది నిర్దోషులైన ఆదివాసులతో సహా ఛత్తీస్‌గఢ్, విదర్భ ప్రాంతంలో మావోయిస్టుల పేరుతో జైలులో మగ్గుతున్న ఆదివాసులందరినీ బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని మేం విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ ఆపరేషన్ సందర్భంగా డుంగ హత్య, లాల్సు మాయం సహా ఇక్కడ జరిగిన నేరాలన్నిటికీ బాధ్యులైన పోలీసు, అర్ధసైనిక బలగాల అధికారులను శిక్షించాలని డిమాండ్ చేయండి. దేశంలోని అత్యంత పీడితులైన ప్రజలపై దోపిడీ ప్రభుత్వాలు సాగిస్తున్న అన్యాయ యుద్ధాన్ని – ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చెయ్యండి. 'శిక్షణ' పేరుతో బస్తర్ ప్రాంతంలో మోహరించిన సైన్యాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చెయ్యండి.

**(గుడ్సా ఉసెండి)**

**అధికార ప్రతినిధి,**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**